తుపాకీలు దించేశారు.

క్షణంలో సగం...

జబ్బుతో మందుల్లేక లేవలేని తల్లి

ఉద్యోగంలేని తమ్ముడు,

ఎదుగుతున్న పిల్లలు.

చాలని జీతం.

కళ్ళల్లో మెదిలేయి వెంకటస్వామికి.

❖ ❖ ❖

మల్లుదొరని పట్టియిచ్చినందుకు వెంకటస్వామికి ప్రభుత్వం లక్ష రూపాయలు ఇచ్చి రుణం తీర్చుకుంది.

**(ఆంధ్రప్రభ, వారపత్రిక 22.6.1998)**

# దేవుడు కథలు ట్వంటీఫస్ట్ సెంచరీ

**ఆ** వేళ పార్లమెంటులో వాతావరణం ఏ క్షనాన బాంబు పేలు తుందా అన్నట్టు ఉంది. ఇస్ పెడితే అగ్గి అయిపోయేట్టు ఉంది. చూపులే చాకులైతే పార్లమెంటు ఉద్యోగస్తులు తప్ప మంత్రి వర్గంలో సహా అంతమంది సభ్యులూ చచ్చిపోయేవారు.

కారణం సమావేశానికి ముందు ఒక ప్రముఖ పత్రికలో ఒక పేరుపడ్డ జర్నలిస్టు ఒక వ్యాసం రాసింది. ఆ వ్యాసానికి ఒక నెల ముందు మన ప్రధానమంత్రిగారు పక్క దేశం ప్రధాన మంత్రిగారితో మూడు రోజుల అంతరంగిక చర్చలు జరిపారు. ఆ వ్యాసం పూర్వార్థం ఏమిటంటే మన దేశంలో ఎప్పుడైనా విప్లవం వస్తే పక్కదేశం ప్రధాని మన ప్రధానమంత్రిగారికి శరణు ఇవ్వడానికి ఒప్పుకున్నారనీ అందుకు ప్రతిఫలంగా మన ప్రధాన మంత్రిగారు మన మిలటరీ రహస్యాలు కొన్ని కోట్ల రూపాయలు పుచ్చుకొని మరీ ఇచ్చేశారని.

ఈ వ్యాసం ఉత్తరార్థం ఆ రెండో ప్రధాని దేశంలో ఎప్పుడైనా విప్లవం వస్తే మనదేశంలో శరణం ఇవ్వడానికి దానికి ప్రతి ఫలంగా ఆ దేశం మిలటరీ రహస్యాలు మన ప్రధానమంత్రికి ఇచ్చేశారనీ మన ప్రధానమంత్రి రెండో ప్రధానమంత్రికి కొన్ని కోట్ల రూపాయలు ఇచ్చేశారనీ.

పార్లమెంటులో ఆ వ్యాసం గురించి చర్చ జరగాలి. “జర” గాలి కూడా పార్లమెంటులో ఆడడం లేదు సరికదా ఉన్న గాలి కూడా ఎంత వేడెక్కిపోయిందంటే బతికున్న మనుషులు బతి కుండగానే కాలిపోతారన్నట్టు ఉంది. వాతావరణంలో ఉన్న క్రౌర్యానికి, పొరపాటున లోపలికి ఎగిరి వచ్చిన గువ్వ గెద్దలా మారిపోయింది.

మన ప్రధానమంత్రిగారు ముసలైపోయారు. అతనికి డయా బిటిస్ దాని కవల బ్లడ్‌ప్రెషర్ ఉన్నాయి. ఇదివరకే రెండు హార్ట్‌ఎటేక్‌లు వచ్చి వెళ్ళాయి. అంతవరకూ మూడో ఎటేక్ ఎప్పు డొస్తుందో తెలియదు కాని వస్తే వెళ్ళేది ప్రధానమంత్రి గారేననీ అంటున్న స్పెషలిస్టులు ఈ చర్చల్లో పాల్గొంటే మూడో ఎటేక్ వస్తుందని అన్నారు.

అంచేత అధికార పార్టీ ప్రధానమంత్రి గారిని చర్చలో నోరు మూసుకొని కూర్చోమని అతని స్థానే ఉపప్రధానినే పాల్గొమ్మని తీర్మానించింది.

చర్చలో ప్రశ్నల సమయం వచ్చేసింది. సభ్యులు చూపుల చాకులకి సానపడుతున్నారు. గెద్ద అయిన గువ్వ వేడికి పిచ్చెక్కి పోయి గెద్దెల బూతుపాత పాడేస్తున్నది. తల్లిపాలు తాగుతున్న లేడి పిల్ల మీదకి ఉరకడానికి సిద్ధంగా ఉన్న పులిపోజులో ఉన్నారు ప్రతిపక్ష నాయకుడు గారు.

మొన్న జరిగిన చర్చలలో మన ప్రధానమంత్రిగారు ఎన్ని కోట్లు పుచ్చుకున్నారన్నది నా మొదటి ప్రశ్న అన్నది ఆయన మొదటి ప్రశ్న.

దాంతో శత్రువు జుత్తు పట్టేసుకున్న వీరాతి వీరుడులా అయి పోయేరు ఉప ప్రధానిగారు. ఆయన భగవద్గీతలో అర్జునుడితో మాట్లాడుతున్న శ్రీకృష్ణుడిలా మీరుఆ ప్రశ్న అలా అడక్కూడదు. ఎలా అడగాలంటే మన ప్రధానమంత్రిగారు డబ్బు ఏమైనా పుచ్చుకున్నారా, పుచ్చుకుంటే ఎంత పుచ్చుకున్నారూ? అని అడగాలి అని అతి శాంతంగా అని కూర్చున్నారు.

ప్రశ్న ఎలా అడగానో మాకు తెలుసుగాని, ముందు జవాబు చెప్పండి లంజాకొడుకుగారూ? అనిప్రతిపక్ష సభ్యులలో ఎవరో అరిచేరు.

లంజకొడుకు అన్నమాట అసభ్యకరం అని అభ్యంతరం చెప్పేరు పార్లమెంటరీ ఎఫెయిర్స్ మంత్రిగారు.

లంజకొడుకు అన్నమాట అసభ్యకరం అయితే కావచ్చు కాని లంజకొడుకుగారూ అన్నది కాదని ప్రతిపక్ష నాయకుడు గారు అన్నారు.

సరిగ్గా ఆ సమయానికే ప్రతిపక్ష నాయకుడి గారి తలకి అతి జోరుగా ఎవరో విసిరిన గాజు పేపర్ వెయిట్ తగిలి ఆ వెయిటూ తల ఒక్కలాగే పగిలిపోయాయి. తర్వాత ముందు పేపరు వెయిటూ తర్వాత నాయకుడి గారూ నేలకి పడిపోయారు.

ఆ తర్వాత సభలో ఏం జరిగిందీ పూర్తిగా ప్రెస్ రిపోర్టర్లు కూడా చెప్పలేదు.

ముందు తిట్లు, దెబ్బలు, మోటు తిట్లు ఇంకా మోట దెబ్బలు, బూతులు, ఎముకలు విరగడాలు, బండబూతులు తలలు పగలడాలు.

ఈలోగా ఏం జరిగిందో ఎవరూ చెప్పలేరు. విసిరిన పేపర్ వెయిట్లూ, ఫైళ్ళూ, చెప్పులూ, చేతికర్రలూ గాలిలో నిలబడి పోయాయి. సభ్యులని తందామని ఎత్తిన కాళ్ళూ, కొడదామని ఎత్తిన చేతులూ తిడదామని విప్పిన నోళ్ళూ ఎలా ఉన్నవి అలాగే ఉండిపోయాయి. ఎవరికీ కాళ్లూ చేతులూ ఆడలేదు. ఊపిరి ఆడడం లేదు. ఒక నిమిషం అయ్యేసరికి అందరికీ చచ్చి పోతామన్న భయం పట్టుకొని రాజీ పడిపోదాం అని అనుకుంటున్న సమయానికి ఏం జరిగిందో తెలియదు కాని గాలి మల్లెల వాసన మోసుకొచ్చిన మలయమారుతంలా అయిపోయింది వాతావరణం. ప్రతి సభ్యుడూ తపస్సు చేస్తున్న బుద్ధుడిలా అయి పోయాడు. పిచ్చి గెద్ద మళ్ళీ గువ్వ అయిపోయి 'ఓం శాంతి శాంతి శాంతి' అంది.

కాని ఈ శాంతి వాతావరణం ఒక నిముషమే ఉంది. సభ్యులు మళ్ళీ బూతులు ప్రారంభించే లోపు స్పీకరు పక్కని ఒక విచిత్రమైన వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతను వెయ్యి వాట్ల నియాన్ లైటులా వెలిగిపోతున్నాడు. అతన్ని చూసేసరికి ఒక మాటలో చెప్పాలంటే ఇన్‌కమ్‌టేక్స్ ఎగకొట్టేసిన మెంబర్లకి యావత్తు పన్ను కట్టేయ్యాలనిపించింది. పార్లమెంటు సభ్యులం దరికీ తామేదో తప్పు చేసినట్టు ఫీల్ అయి వాళ్ళ సభ్యత్వానికి రాజీనామా చేసెయ్యాలనిపించింది.

ఎవరు బాబూ నువ్వు అనడిగేరు స్పీకరుగారు.

దేవుణ్ణి అన్నాడు అతను నవ్వుతూ

కూర్చోండి అన్నాడు స్పీకర్ గారు కుర్చీలోంచి లేస్తూ...

ఫర్వాలేదు కూర్చొండి – నేను మాట్లాడవచ్చా? అని జనాంతికంగా అన్నాడు దేవుడు.

అవస్యం అన్నారు కవల అన్నదమ్ముల్లా ప్రధానమంత్రీ – ప్రతిపక్ష నాయకుడూను.

దేవుడు మాటాడ్డం మొదలు పెట్టేడు–నేను ఎక్కువ మాట్లాడను.

యావత్ ప్రపంపం నేనే సృష్టించినా నాకు భారతదేశం అంటే ఎక్కువ ఇష్టం (కరతాళ ధ్వనులు) అందుకే మీకు వేదాలు ఇచ్చేను. (దేవుడూ జిందాబాద్ అన్న నినాదాలు).

మిగతా వాళ్ళకి బైబిల్, ఖురాన్ వగైరా పుస్తకాలు పారేసాను (హియర్ – హియర్)

కాని ఇప్పుడు దేశాన్ని చూస్తే బాధ అనిపిస్తున్నది. అసలు ఈ సృష్టే ఎందుకు చేశానా అని విచారిస్తున్నాను.

అయినప్పటికీ ఇప్పుడొచ్చిన బాధేం లేదు. మీరు పెట్టుకున్న ఎలక్షన్ల పద్ధతి తప్పు అనను.

దేశం ఒక ఏడాదిలో సుభిక్షం చేసే ప్లాను నా దగ్గర ఒకటి ఉంది.

మీ పార్లమెంటులో ఉన్న ఏ పార్టీ ఒక పార్టీ కాదు. మీకున్నది కొయలీషన్ గవర్నమెంటు. అందులో ముప్పై పార్టీలూ, అరవై గ్రూపులూ ఉన్నాయి. ఒక అపోజిషన్ పార్టీలంటారా? అపోజిషన్లో ఎంతమంది మెంబర్లు ఉన్నారో అన్ని పార్టీలు ఉన్నట్టే లెక్క.

అలాగని మీరు ప్రజా ప్రతినిధులు కాదని నేననను.

నాది ఒక్కటే కోరిక ఇప్పుడు మీరంతా కలిసి ఒక ప్రధాన మంత్రిని ఎన్నుకోండి. ఏకగ్రీవంగా ఎన్నుకోమని కూడా నేననను. ప్రధానమంత్రి పదవికి ఎంతమందైనా పోటీ చెయ్యవచ్చు. ఆ ప్రధాని కేబినెట్లో అంతమంది పార్లమెంటు మెంబర్లూ మంత్రులే.

నేను మీకు మూడు గంటలు టైమిస్తున్నాను. ఈమూడు గంటల్లోనై మీరేం చేస్తున్నదీ మరేం మాట్లాడిందీ నేను తెలుసుకోగల్ను కాని తెలుసుకోను.

నేను వెళ్ళిపోయాక తలుపులన్నీ వాటంతటవే మూసుకు పోతాయి. సభ్యులు కానివాళ్ళంతా వెళ్ళిపోతారు. తలుపులు మూసుకొనే లోపునే మీ అందరిముందూ నామినేషన్ ఫారాలు ఉంటాయి.

స్పీకరు గారు ఎలక్షను నడుపుతారు. సమంగా ఇప్పట్నుంచీ మూడుగంటలవగానే నేను స్పీకరుగారి ఛాంబర్లోకి రెండోతోవని వస్తాను. స్పీకరుగారు తన ఛాంబరుకి వచ్చి ఎన్నికైన ప్రధాని పేరు చెప్తే నేను మళ్ళీ మీ దగ్గరకు వచ్చి దేశాన్ని ఒక ఏడాదిలో అగ్రరాజ్యాల్లో మొదటిదిగా అయ్యేటట్టు చెయ్యడానిక ఒక పథకం చెప్తాను.

మూడు గంటలు సెలవిప్పించండి. అని అతి వినయంగా అందరికీ నమస్కారం చేసి దేవుడు మాయమైపోయాడు.

దేవుడికి ఎలక్ట్రానిక్ వాచీ ఉందో ఏమిటో సరిగ్గా మూడు గంటలైన మరు సెకండు స్పీకరే ఛాంబర్లో (గదిలో) ప్రత్యక్షమై స్పీకరుగారి కుర్చీకి ఎదురు కుర్చీలోకూచోబూతూ ఉంటే మీరు నాకు మరో అన్యాయం చేసి పారేశారు సార్ అంటూ పార్ల మెంటు హాల్ నుండి స్పీకర్ గారు దయచేశారు.

నేను మీకు అన్యాయం చేసేనా అయామ్ సో వెరీ సారీ ఏం చేసేనో చెప్పండి అని దేవుడు మనుషుల్లాగే ముందు ఆశ్చర్య పోయి, తర్వాత అభ్యర్థించేడు.

దేవుడి మర్యాదచూసి స్పీకర్ రెచ్చిపోయాడు. అన్యాయం కాకపోతే మీరు చేసిన పనేమిటో నాతో చెప్తారా? నన్ను ఎలక్షన్ నడపమంటే ప్రధానమంత్రి పదవికి నన్ను నిలబడొద్దనే కదా మీఉద్దేశం?

ఈ మాటికి క్షమించెయ్యండి. ఇలాంటి తప్పులు ఇటుపైన రాకుండా చూసుకుంటాను దేవుడు క్షమాపణ కోరాడు.

క్షణం నిశ్శబ్దం.

స్పీకరు ఏడుపు మొహం మారలేదు.

దేవుడికి కుతూహలం ఆగలేదు.

ఇంతకీ ఎలక్షన్ జరిగిందా. ఉండపట్టుకోలేక అడిగేసాడు దేవుడు.

మీరు వెళ్ళిపోయాక మా సిబ్బంది కూడా వెళ్ళిపోయేక తలుపులు వాటంతటవే మూసుకుపోయాయి.

పార్లమెంటులో నన్ను తప్పిస్తే చార్ సౌ బీస్ అంటే నాలుగు వందల ఇరవై మంది మెంబర్లు ఉన్నారు.

నేను నామినేషన్ దాఖలు చెయ్యదలచుకుంటే వాళ్ళని నామినేషన్ ఫారం సంతకం చేసి నాకు ఇచ్చెయ్యమన్నారు. ఏ క్యాండిటేట్‌నైనా ఎవరైనా సెకండ్ చెయ్యదలచుకుంటే నా సమ క్షంలో సంతకం చెయ్యమన్నారు ఆగారు స్పీకరుగారు.

అదేం? అమాయకంగా అడిగాడు దేవుడు.

మీకేం తెలుసండీ మా మెంబర్ల సంగతి. నేను అలా రూల్ పెట్టకపోతే ప్రతివాడు మిగతా నాలుగువందల తొమ్మిది మందినీ సెకండ్ చేస్తూ సంకాలు పెట్టిస్తాడు. తర్వాత ఒక్క సంతకం కూడా పెట్టలేదంటాడు. నామినేషన్ పడేసి వాడికి ఎవరూ సెకండ్ చెయ్యడానికి దొరకకపోతే వాడే ప్రధానమంత్రి. సంతకం ఫోర్జరీ చేసేస్తాడు. మళ్ళీ ఆగేరు స్పీకర్‌గారు–ఆయాస పడుతూ...

తన సృష్టి కొంచెం అర్థమవుతున్నది దేవుడికి.

ఆ రూల్ పెట్టాక ఎవడి నామినేషన్ ఫారం వాడినే పట్టుకొచ్చి నాకు ఇమ్మన్నాడు.

ఒక్కొక్కర్నే అంటే ఒక క్యూలో నా దగ్గరకు రమ్మన్నాడు. ఆయాసంతో మళ్ళీ ఆగారు స్పీకరుగారు.

ఎవరైనా నామినేషన్ వేసేరా? కుతూహలం అణుచుకోలేక దేవుడు అడిగేశాడు.

ఎవరైనా వెయ్యడం ఏమిటి? నాలుగు వందల పంతొమ్మిది మంది నామినేషన్లు పారేసారు. స్పీకరుగారు చెప్పారు.

ఆ నాలుగు వందల ఇరవయ్యోవాడు ఎవరినైనా సెకండ్ చేస్తే ఎలక్షను అయిపోయినట్టే కదా!

దేవుడికి ఆశ పూర్తిగా చచ్చిపోలేదు.

మీరు ఎలక్షన్లు ఎప్పుడూ చూడలేనట్టుందే స్వర్గంలోనై ఇంద్రుడి పదవికి ఎలక్షన్ ఉంటుందన్నాడే – ఆ మధ్య ఓ హరిదాసు. ఆ నాలుగువందల ఇరవయ్యోవాడు కూడా నిమి నేషన్ వెయ్యడానికి ఫారం పట్టుకొని వస్తూ వుంటే వాడు హాల్ చివర ఉన్నాడు. తోవలో నన్ను సెకండ్ చెయ్యరా లంజాకొడకా అంటే నన్ను సెకండ్ చెయ్యరా అంటూ మిగతా నాలుగు వందల పంతోమ్మిది మందీ చావగొట్టేశారు. అతగాడు సగం తోవలో చచ్చేసేడు.

ఓరి భగవంతుడా అన్నాడు దేవుడు.

నీ పేరు నువ్వే తలుచుకుంటావేమయ్యా దేవుడా? వెనకటికి నీలాంటివాడే తుమ్మి చిరంజీవ అనుకున్నాడట. అలాగుంది నీ వ్యవహారం అన్నారు స్పీకరుగారు.

**(1998)**